నేడే జూబ్లీహిల్స్ బై పోల్

- పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, డ్రోన్లతో నిఘా
- ఇవిఎంలతో పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది
- భద్రత కట్టుదిట్టం

పోలింగ్ సెంటర్‌కు చేరుకుంటున్న పోలింగ్ సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ మంగళవారం జరగనుంది. అందుకు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. 25 రోజులుగా హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం ఆదివారం సాయంత్రంతో ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఉప ఎన్నికలో మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం 407 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది. యూసఫ్‌గూడలోని డిఆర్‌సి సెంటర్‌లో ఇసి అధికారులు సిబ్బందికి ఇవిఎంలను, పోలింగ్ స్టేషన్లను కేటాయించారు. ఈవీఎంలను తీసుకుని ఎన్నికల సిబ్బంది సోమవారం సాయంత్రం పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి.కర్ణన్ పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న ఉప ఎన్నిక నేపథ్యంలో జిహెచ్‌ఎంసి, పోలీస్ శాఖ మరింత అప్రమత్తమైంది. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలతో నిఘా పెట్టారు. డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేయనున్నారు. పోలింగ్ ఏజెంట్‌కు, సిబ్బందికి ప్రత్యేక పాస్‌ను కేటాయించారు. పోలింగ్ నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని వైన్స్, పబ్బులు మూసేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లకు, కాలేజీలకు, కార్యాలయాలకు సెలవు ప్రకటించారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. 2060 మంది ఎన్నికల సిబ్బందితోపాటు 2000మంది పోలీస్ సిబ్బందితో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే 144 సెక్షన్ ఆంక్షలు విధించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈనేపథ్యంలో 139 సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నేడు పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాన్ని వెల్లడిస్తారు.

ఓటర్లు ముందుకు వచ్చి ఓటెయ్యాలి : ఆర్‌వి.కర్ణన్

అర్హత కలిగిన వారు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ముందుకొచ్చి ఓటెయ్యాలని జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి.కర్ణన్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్ స్టేషన్లలో 226 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. పోలింగ్‌ను డ్రోన్ల ద్వారా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈసారి నాలుగు బ్యాలెట్ యూనిట్లు వాడుతున్నామని తెలిపారు. వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేశామని, అన్ని పోలింగ్ స్టేషన్స్ దగ్గర 1950 నెంబర్‌గల హెల్ప్ డెస్క్‌లు ఉన్నట్టు చెప్పారు.

జియోటస్ నుంచి తెలుగులో క్రిప్టో లెర్నింగ్ వేదిక ఏర్పాటు

హైదరాబాద్ : దేశంలోనే తొలి ఎఐ ఆధారిత తెలుగు క్రిప్టో ఫ్యూచర్స్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు జియోటస్ తెలిపింది. జియోటస్ అకాడమీ పేరుతో ఏర్పాటు చేసిన ఈ వేదిక క్రిప్టో ఫ్యూచర్స్ ట్రేడింగ్ గురించి తెలుగు వినియోగదారులకు అవగాహన కల్పిస్తుందని ఆ సంస్థ కోఫౌండర్, సిఇఒ విక్రమ్ సుబ్బురాజ్ తెలిపారు. క్రిప్టో మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి, ముఖ్యంగా తెలుగు మాట్లాడే వారికి, సరైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను ఉచితంగా అందించడం ద్వారా ఆర్థిక సాధికారత కల్పించాలని జియోటస్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

సామాజిక కార్యక్రమాలకు రూ.169 కోట్ల వ్యయం

- హెచ్‌సిఎల్ ఫౌండేషన్ వెల్లడి

నోయిడా : హెచ్‌సిఎల్ టెక్‌నకు చెందిన హెచ్‌సిఎల్ ఫౌండేషన్ గడిచిన పదేళ్లలో సామాజిక కార్యక్రమాలకు రూ.169 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపింది. గ్రామీణ ప్రాంతాలకు మద్దతును ఇచ్చే లక్ష్యంతో 2015లో ప్రారంభమైన తమ ఫౌండేషన్ అనేక విజయాలు సాధించిందని హెచ్‌సిఎల్ టెక్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్ర తెలిపారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలలో 168 జిల్లాల్లోని 23 లక్షల ప్రజల జీవితాల్లో సానుకూల ప్రభావం చూపిందన్నారు. ఈ ప్రాజెక్టుల్లో మంచి నీటి వనరులు, మొక్కలు నాటడం, జీవవైవిధ్యం, విద్య, ఆరోగ్యం ప్రధాన ప్రాజెక్ట్ విభాగాలుగా ఉన్నాయని హెచ్‌సిఎల్ సిఎస్ఆర్ ప్రతినిధి నిధి పుందిర్ పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో సోనాటైప్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

సాఫ్ట్‌వేర్ సప్లయి చెయిన్ సెక్యూరిటీలో అంతర్జాతీయ అగ్రగామి సంస్థ అయిన సోనాటైప్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో తమ నూతన ఇండియా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేసింది. దీనిని సోమవారం తెలంగాణ ప్రభుత్వ ఐటి రంగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ లాంచనంగా ప్రారంభించారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత ఆవిష్కరణలను వేగవంతం చేయడం, ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ భద్రతను బలోపేతం చేయడం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యాలని సోనటైప్ సిఇఒ భగవత్ స్వరూప్ తెలిపారు. భగవత్ మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే 100 మంది ఉద్యోగులను తీసుకున్నామని.. మరో ఎనిమిది, తొమ్మిది నెలల్లో రెట్టింపు ఉద్యోగులను తీసుకోనున్నామని చెప్పారు. ఇంజనీర్లు, ఉత్పత్తి నిపుణులు, ఎఐ పరిశోధకులతో పనిచేసే ఈ హబ్ ప్రపంచవ్యాప్తంగా సోనాటైప్‌కు అతిపెద్ద ఆర్‌అండ్‌డి కేంద్రంగా పని చేయనుందన్నారు. మీడియా సమావేశంలో సోనాటైప్ చీఫ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మిషెల్ జాన్సన్, సోనాటైప్ హెడ్ ఆఫ్ ఇండియా అండ్ సీనియర్ డైరెక్టర్ ఆఫ్ టెక్నాలజీ అభిషేక్ చౌహాన్ పాల్గొన్నారు.

ఐటిసి సన్‌ఫీస్ట్ ఫెంటాస్టిక్ చాకో మెల్జ్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ఐటిసి లిమిటెడ్ తన 'సన్ ఫీస్ట్ ఫెంటాస్టిక్' బ్రాండ్‌ను విస్తరించినట్లు తెలిపింది. కొత్తగా 'చాకో మెల్జ్' అనే ఉత్పత్తిని మార్కెట్లోకి విడుదల చేసింది. ఇది చిన్న ప్యాకెట్లలో లభ్యమయ్యే ద్రవ రూపంలోని చాక్లెట్ స్ప్రెడ్. దీనిని రొట్టె, చపాతీ, పరాటా, లేదా పండ్లపై వేసుకొని తినవచ్చని ఐటిసి ప్రతినిధి అనూజ్ బన్సల్ తెలిపారు. కేవలం రూ.5కే లభిస్తుందన్నారు.

గొర్రెల కాపరి నుంచి ప్రజా కవిగా

- అందెశ్రీ ప్రస్థానం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఆయన 1961 జులై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలో జన్మించారు. గొర్రెల కాపరిగా జీవన ప్రస్థానం ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 'మాయమైపోతున్నడమ్మా' గీతంతో మంచి పేరు తెచ్చుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గీతంగా గుర్తించింది. ఆయనకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి పురస్కారం అందించింది. ఆశుకవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట. 2006లో గంగ సినిమాకుగానూ ఆయనకు నంది పురస్కారం లభించింది. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్ వరించింది. 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం అందుకున్నారు. 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం లభించింది. 'అందెశ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు గొంతుకగా నిలిచారు' అని ప్రధాని మోడీ... ఎక్స్‌లో స్పందించారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని, తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్, మంత్రులు పేర్కొన్నారు. అందెశ్రీ మృతి తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతి పట్ల బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన సాంస్కృతిక ఉద్యమంలో ఆయన పాల్గొన్నారని గుర్తు చేశారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం

అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. అనేక అభ్యుదయ గీతాలు రచించిన ఆయన ఈకాలపు వాగ్గేయకారుల్లో ఒకరని, ఆయన మరణం సాహిత్య రంగానికి తీరనిలోటని పేర్కొంది. అందెశ్రీ భౌతికకాయాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ మంత్రులు రామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎంపి ఈటెల రాజేందర్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, ఎమ్మెల్సీలు కవిత, గోరటి వెంకన్న, బిఆర్‌ఎస్ నాయకులు కెటిఆర్, హరీశ్‌రావు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

వేధింపులు ఆపాలంటూ విధులు బహిష్కరించిన ఐఐటి కార్మికులు

- ఐఐటి హైదరాబాద్ గేటు ఎదుట కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐఐటి కార్మికుల సమస్యల పరిష్కారించాలని, భూములు కోల్పోయిన ఐఐటి కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఐఐటి కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐఐటిలో పనిచేస్తున్న దాదాపు 500 మంది కాంట్రాక్టు కార్మికులు విధులు బహిష్కరించి ఐఐటి ప్రధాన గేటు ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఐఐటి కార్మికులపై వేధింపులు ఆపాలని, భూములు కోల్పోయిన కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. అనంతరం సంగారెడ్డి డిఎస్‌పి సత్తయ్య ఆధ్వర్యంలో కార్మికులు ఐఐటి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంట్రాక్టర్, ఐఐటి అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులు మాట్లాడుతూ.. తమ భూములు కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఐఐటిలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నామని అన్నారు. కానీ ఐఐటి అధికారులు, కాంట్రాక్టర్ సూపర్‌వైజర్లు మాత్రం.. ముగ్గురు చేసే పనిని ఒకే కార్మికునిపై వేసి పనిభారం మోపుతున్నారని తెలిపారు. కార్మికులు ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తే వారిని తొలగించడం, వారి ఫోటోలను బయట అతికిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. స్థానిక డిసిఎల్ అధికారులు ఐఐటి అధికారులతో కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమను రెగ్యులర్ చేసి, ఇఎస్ఐ, పిఎఫ్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్మికులందరికీ క్యాంటీన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల చెల్లించాలన్నారు. కొంతమంది భూములు కోల్పోయినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగాలు ఇవ్వలేదని తెలిపారు. కార్మికులు సంఘటితం కావడం కోసం సంఘం స్థాపించుకోవాలనుకుంటే కార్మిక శాఖ అధికారులు కుమ్మక్కై సంఘం పెట్టుకోకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా డబ్బులు తీసుకుని ఇతరులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని అన్నారు. కార్మికులందరికీ ఐఐటిలో ఉన్న ఆస్పత్రిలో చికిత్స సదుపాయాన్ని కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలన్నారు. ప్రతి నెలా రెండో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. వెంటనే ఐఐటి అధికారులు, కాంట్రాక్టు సూపర్‌వైజర్లు తమ సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పల్పనూరు శేఖర్, కుమ్మరి గోపి, కాజా పాషా, మహబూబ్,భాస్కర్, సత్యనారాయణ,దామోదర్, సంజీవ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగా అజారుద్దీన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మైనార్టీ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖల మంత్రిగా మహమ్మద్ అజారుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత నెల 31న మంత్రిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయన చేత మంత్రిగా ప్రమాణం చేయించగా, నవంబర్ 4న ఆయనకు శాఖలు కేటాయించిన సంగతి తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బిసి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరితో పాటు పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి 20 స్కూళ్లలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆటవిడుపుగా అనేక క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాల్లోని 20 ప్రాంగణాల్లో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ లో 294 గురుకుల పాఠశాలల నుంచి 12,570 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన చెప్పారు. 19 సంవత్సరాల్లోపు విభాగంలో ప్రతి స్కూల్ నుంచి 20 మంది విద్యార్థులు, 14 సంవత్సరాల్లోపు విభాగంలో ప్రతి స్కూల్ నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొంటారనీ, 19 సంవత్సరాల్లోపు విభాగంలో 5,220 మంది విద్యార్థులు, 14 సంవత్సరాలలోపు విభాగంలో 7,350 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్నే విద్యార్థులకు రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్ పుట్, డిస్క్ త్రో, కబడ్డీ, కోకో, వాలీబాల్, టెన్నికాయిట్, చెస్ తదితర ఆట పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలతో రాష్ట్ర స్థాయిలో త్వరలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభ ను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు 17 సంవత్సరాల్లోపు విభాగంలో నిర్వహించిన పోటీల్లో 294 బీసీ గురుకుల పాఠశాలల నుంచి 10,290 విద్యార్థులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు జిల్లా స్థాయిలో సాంస్కృతిక , సాహిత్య, వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులు వచ్చే నెల రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కల్చరల్ కార్నివాల్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

'శ్రమ శక్తి నీతి'తో వెట్టే..

- విరామం ఎరుగక గొడ్డు కష్టం చేయాల్సిందే..
- ట్రంప్ కట్టు బానిసలు మోడీ, అమిత్ షా : ఎస్ వీరయ్య
- మోడీ అడుగుజాడలో రేవంత్‌రెడ్డి : భూపాల్
- కాటేదాన్‌లో సిఐటియు రంగారెడ్డి జిల్లా మహాసభ ప్రారంభం

అభివాది చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులతో వెట్టిచాకిరి చేయించేందుకు కుట్రలు పన్నుతూ నీతిమాలిన చర్యలకు పాల్పడుతుందని, 'శ్రమ శక్తి నీతి' పేరుతో కార్మికులను బానిసత్వంలోకి నెట్టేందుకు పూనుకుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కార్మికులు వేతనాలు అడగరని చెబుతున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు.. ఏమీ తిని బతుకుతున్నారని, గడ్డి తింటున్నారా అని ప్రశ్నించారు. కార్మికులకు కడుపు లేదా.. ఆకలి ఉండదా అని నిలదీశారు. పెట్టుబడిదారుల ఆకలి కోసం ఆలోచన చేస్తున్న పాలకులు శ్రామికుల ఆకలి కోసం ఎందుకు ఆలోచన చేయడం లేదన్నారు. సిఐటియు రంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాటేదాన్ పారిశ్రామిక క్లస్టర్ ప్రాంతంలోని స్వప్న థియేటర్ ఎదుట భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా సంఘం నాయకులు గుండె యాదయ్య చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.రమేష్, ఉపాధ్యక్షులు భూపాల్‌తో కలిసి వీరయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎన్.రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు.

దేశ కార్మికులను ఐక్యం చేసి శ్రామికుల సమస్యలను పరిష్కారించేందుకు సిఐటియు పనిచేస్తోందన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం కార్మికులు ఐక్యం అయ్యేందుకు అవకాశం లేదు.. యూనియన్లు పెట్టుకునేందుకు వీలు లేదంటోందని తెలిపారు. కనీసం వేతనం అడిగితే పాలకులకు చిరాకుగా ఉందన్నారు. 'శ్రామికులు గొడ్డుచాకిరి చేయాల్సిందే.. యాజమాన్యాలను ప్రశ్నించడానికి వీలు లేదు' అనే పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకు వచ్చిందన్నారు. దేశంలో కార్మికుల శ్రమకు ప్రత్యేకత లేదని, విదేశాల కార్మికుల శ్రమకు.. భారతీయ కార్మికుల శ్రమకు తేడా ఉందని, ఇక్కడ పని చేయడం ముఖ్యమని, వేతనాలు ముఖ్యం కాదని, కార్మికులకు పని ఆలోచన తప్ప మరోటి ఉండకూడదని, కార్మికులు ఇచ్చింది తీసుకోవాలని డిమాండ్ చేయకూడదని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు చెబుతున్న నీతి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి ఉత్పత్తి రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆకలి ఉండదని, డబ్బులు అడగరని చెబుతున్న మోడీ.. ఒక్క పూట తిండికి రూ.లక్షలు ఎందుకు ఖర్చు చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ట్రంప్ కుట్రలు పన్నుతుంటే.. దేశాన్ని ట్రంప్‌నకు దాసోహం చేసేందుకు మోడీ రెడీ అయ్యారని అన్నారు. కమ్యూనిస్టుల కాలం చెల్లించిందని అంటున్న వారు ఒక్కసారి కండ్లు తెరిచి ప్రపంచం వైపు చూడాలన్నారు. ప్రపంచం సోషలిజం వైపు పరుగెడుతోందన్నారు. యువతరం సోషలిజం కోరుకుంటుందని.. అగ్రరాజ్యం అయిన అమెరికా రాజధాని న్యూయార్క్ మేయర్‌గా యువ సోషలిస్టు ఎన్నికయ్యారని తెలిపారు. భవిష్యత్ ఎర్రజెండాదే అనే విషయాన్ని మరిచిపోవద్దని అన్నారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేండ్లు కావొస్తున్నా ఇప్పటికీ కార్మికుల సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. మోడీ విధానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. 10 గంటల పనివిధానంపై జీవో తీసుకువచ్చారని గుర్తు చేశారు. 72 రంగాల్లో వేతన సవరణ చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టంతా.. 'రింగ్ రోడ్ల కాంట్రాక్టు ఎవరికి ఇవ్వాలి.. పెట్టుబడిదారుల కోసం పేదల నుంచి భూములు ఎలా లాక్కోవాలి' అన్న దానిపైనే ఉంటున్నారన్నారు. రంగారెడ్డి జిల్లా ధనిక జిల్లా అంటున్నారని.. నెల జీతం సుమారు రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం అంచనాలు వేసిందన్నారు. కానీ మున్సిపల్, గ్రామ పంచాయతీ, ఆశ, అంగన్‌వాడీల వేతనాలు రూ.10వేల నుంచి రూ.15 వేలకు మించి ఎందుకు లేవని ప్రశ్నించారు. వీరి వేతనాలను కూడా రూ.2లక్షలతో పోల్చితే ఎలా అని నిలదీశారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ మహాసభలో కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చ, భవిష్యత్ ఉద్యమాలకు కార్యాచరణ ఉంటుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి కె.రమేష్ మాట్లాడుతూ.. దేశ సంపదకు మూలాలైన కార్మికులను బానిసలుగా చేసేందుకు కాషాయ నేతల నిర్ణయాలు ఉన్నాయన్నారు. దేశ కోసం, ధర్మం కోసం పనిచేస్తోంది మోడీ కాదని కార్మికులేనని స్పష్టం చేశారు. తాము కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతామన్నారు. ఈ సభలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.చంద్రమోహన్, కోశాధికారి జి.కవిత, జగదీశ్, బ్రమ్మయ్య, కిషన్, రుద్రకుమార్, వీరయ్య, దేవేందర్, స్వప్న, సాయిబాబు, రామ్మోహన్, కిసరి నర్సిరెడ్డి, సునీత, జిల్లా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉల్లిగడ్డ లోడ్ లారీ బోల్తా..

- బస్తాలు ఎత్తుకెళ్లిన జనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉల్లిగడ్డ లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తాపడగా.. అటుగా వెళ్తున్న జనం అందినకాడికి ఉల్లిబస్తాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సోమవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం, ఎపి లింగోటం హైదరాబాద్- విజయవాడ హైవేపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్లిగడ్డల లోడుతో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న లారీ ఏపీ లింగోటం గ్రామం వద్దకు చేరుకోగానే అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మానవత్వం చూపాల్సిన స్థానికులు.. డ్రైవర్, క్లీనర్లను పట్టించుకోకుండా.. ఆటోలు, బైకులు, అందుబాటులో ఉన్న వాహనాలలో ఉల్లిగడ్డ బస్తాలకు ఎత్తుకెళ్లారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కాంగ్రెస్

- సిఇఒ సుదర్శన్‌రెడ్డికి హరీశ్‌రావు ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన తర్వాత కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఇష్టారాజ్యంగా మద్యం, విచ్చలవిడిగా డబ్బులు, లక్షకుపైగా చీరలు, మిక్సీ గ్రైండర్లను పంపిణీ చేస్తున్నదని వివరించారు. అధికార పార్టీకి కొందరు అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారనీ, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని వీడియో, ఫొటో ఆధారాలను ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో హరీశ్‌రావు నేతృత్వంలో కలిసి సమర్పించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తున్నామనీ, పోలీసు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైన వారనీ, తగిన రీతిలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తారని అన్నారు. అధికార దుర్వినియోగం జరుగుతున్నా ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. సున్నిత, సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల్లో కేంద్ర బలగాలను పెట్టాలని కోరారు. మహిళా పోలీస్ అధికారులను, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లను అక్కడ నియమించి లోపలికి వెళ్లే ఓటర్లను గుర్తించిన తర్వాతనే పోలింగ్ బూత్‌లలోకి అనుమతించాలని సూచించారు. ఓటర్ గుర్తింపు కార్డు లేకుండా ఓటర్లను పోలింగ్ బూత్‌లలోకి పంపించొద్దని అన్నారు.

'నయీ దిశ' ఎన్‌జిఒకు పదేళ్లు

హైదరాబాద్ : భారతదేశంలో మేధస్సు ఎదుగుదలకు సంబంధించిన సమస్యలు (ఐడిడిఎస్) సాయం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ అయినా 'నయీ దిశ' పిల్లల సంరక్షణలో 10 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు తెలిపింది. 2015లో హైదరాబాద్‌లో ఒక సమాచార కేంద్రంగా ప్రారంభమైన తమ జర్నీ.. ప్రాచీ డియో అనే మహిళ తన సోదరుడికి డౌన్ సిండ్రోమ్ ఉన్నందున అతడిని చూసుకునే సమయంలో తమ కుటుంబం ఎలాంటి కష్టాలు పడిందో దగ్గర నుండి చూసిందని పేర్కొంది. ఎదుగుదల సమస్యలు ఉన్న బిడ్డను పెంచడంలో ఉన్న ఆ సవాళ్లను ప్రత్యక్షంగా చూసిన ప్రాచీ డియో, ఆ వ్యక్తిగత అనుభవంతోనే స్ఫూర్తి పొంది నయీ దిశ సంస్థను ప్రారంభించామని డిఎఫ్‌జిసి అధ్యక్షుడు డాక్టర్ ప్రమోద్ గడ్డం తెలిపారు.

మహారాజశ్రీ
మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.W.O.P.10/2022
Chabolu Kishore ...Petitioner
Vs
Chabolu Varalakshmi Devi @ Kannasani Varalakshmi Devi .... Respondent.
To,
Chabolu Varalakshmi Devi @ Kannasani Varalakshmi Devi
w/o Chabolu Kishore, aged about 36 years, Hindu, Saftware Employee, resident of Door No. 8-1-207/3/A/2/1, Brundavan Colony Mailardevpally, Hydrabad, Ranga Reddy District, Telangana State.
PETITION FILED UNDER ORDER 5 RULE 20 AND UNDER SECTION 151
పైనెంబరు గల పిటీషన్‌లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ జారీ కాబడి ఉండలేదు. కాన శ్రీయుత కోర్టు వారి ఆదేశాల మేరకు తెలియజేయునది ఏమనగా తేదీ:17-11-2025న ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనేది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వులతో //
ఇట్లు
రాత్లవత్ బాలునాయక్,
అడ్వకేట్, మార్కాపురం,
ప్రకాశం జిల్లా,
సెల్: **9390638227.**

మహారాజశ్రీ గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వారి కోర్టులో, గుంటూరు
I.A. 1930/2019
In OS 246/2014 AS /2025
బిట్వీన్
1 షేక్ చింతపల్లి హుస్సేన్ బి W/o లేటు ఖాశిం
2 చింతపల్లి షేక్ యూసఫ్ S/o లేటు ఖాశిం
3 షేక్ మారంబి W/o సర్దార్.
4 చింతపల్లి షేక్ అల్లాబక్షు ...పిటీషనర్లు/ అప్పిలెంట్లు
పై వారందరూ అయ్యప్ప నగర్, ఫైర్ స్టేషన్ రోడ్, జగ్గయ్యపేట పట్టణం మరియు మండలం కృష్ణాజిల్లా.
ఎదిరి
1 షేక్ చింతపల్లి ఖాశింబి W/o లేటు మస్తాన్
2 షేక్ బియామ్మ W/o ఖాశిం సయ్యద్
3 చిక్కం జానమ్మ W/o కొండ ...... రెస్పాండెంట్స్
4 షేక్ నాగుల్ బి W/o ఇస్మాయిల్
R1,R4 అందరు కిష్టాపురం గ్రామం, మేళ్లచెరువు మండలం సూర్యపేట జిల్లా
5 రాయ కొండారెడ్డి S/o పిచ్చిరెడ్డి
గుడిపాడు గ్రామం క్రోసూరు మండలం, పల్నాడు జిల్లా
పై నెంబర్ I.A.1930/2019 లో పిటిషనర్ అప్పిలెంట్లు పలుమార్లు బత్తా కట్టి సమన్లు సర్వీస్ చేసినప్పటికీ మీరు ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తున్న నేపథ్యంలో పిటిషనర్లు శ్రీ కోర్టువారిని పర్యాయంగా పత్రికా ప్రకటన కోరిన కారణంగా శ్రీ కోర్టు వారు అనుమతించి ఇచ్చినఉత్తర్వుల ప్రకారము పై నంబరు I.A. 1930/2019 లో ది 4/12/2025 తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనలు నేరుగా గాని వకీలు ద్వారా గాని వినిపించుకో వలసి ఉన్నది. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపరచటమైనది.
ఇట్లు
ఉల్లం శేషగిరిరావు,
ఉసిరికాయల సాంబశివరావు,
తేది: 12/11/2025 **నర్రా శ్రీనివాసరావు,**
గుంటూరు. **పిటీషనర్ తరుపు న్యాయవాదులు,**

బస్సు ఢీకొట్టడంతో మెకానికల్ ఛార్జిమెన్ మృతి

- పరిగి ఆర్‌టిసి డిపోలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బస్సు ఢీకొట్టడంతో బస్‌డిపోలో పనిచేసే మెకానికల్ ఛార్జిమెన్ మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి ఆర్‌టిసి డిపోలో సోమవారం జరిగింది. పరిగి ఎస్‌ఐ మోహన్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 7.30 గంటలకు పరిగి బస్ డిపోలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెంకటేష్ అజాగ్రత్తగా.. నిర్లక్ష్యంగా.. బస్సు నడుపుతూ సెక్యూరిటీ ఆఫీస్ ఎదుట నిలబడ్డ మెకానికల్ ఛార్జిమెన్ అబ్దుల్ కుదుస్ (59)ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయాలయ్యి కింద పడిపోయాడు. వెంటనే అతన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తెలంగాణా ముద్దుబిడ్డ డాక్టర్ అందెశ్రీకి టిఎస్ యుటిఎఫ్ నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ రచయిత అందెశ్రీ (అందె ఎల్లయ్య)కు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) అశ్రు నివాళు లర్పించింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "నిరక్షరాస్యుడైన ఎల్లయ్య పశువుల కాపరిగా జీవనం ప్రారంభించి స్వయం కృషితో, తన గళంతో, కలంతో గొప్ప రచయితగా ఎదిగారు. ఆశు కవితలు చెప్పడలో దిట్ట అయిన ఎల్లయ్య "అందెశ్రీ" కలం పేరుతో అనేక పాటలు రాశారు. తెలంగాణా ఉద్యమ గీతాలతో పాటు అనేక సామాజిక గీతాలు రచించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉరకలెత్తించిన "జయ జయహే తెలంగాణ " గీతం తెలంగాణా రాష్ట్ర గీతంగా ఎంపికై, ప్రతిరోజు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఆలపించబడుతున్నది. "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు ", "కొమ్మ చెక్కితె బొమ్మరా, కొలిచి మొక్కితె అమ్మరా" లాంటి పాటలు అందెశ్రీ సామాజిక దృష్టికి ఉదాహరణ. పలు సంస్థల నుంచి సాహితీ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్న అందెశ్రీ మరణం తెలంగాణ ప్రజలకు, ప్రత్యేకించి సాహిత్యాభిమానులకు తీరని లోటు...." అని టిఎస్ యుటిఎఫ్ పక్షాన అందెశ్రీకి జోహార్లు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం తీవ్ర దిగ్భ్రాంతి

ప్రముఖ గేయరచయిత, తెలంగాణ రాష్ట్ర గీతం సృష్టికర్త అందెశ్రీ అకాల మరణం పట్ల ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొంట సత్యనారాయణ, పెంట అంజయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్స్ సూర్యదేవర దానయ్య, చాగంటి ప్రభాకర్ తదితరులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన తెలుగు సాహిత్యానికి, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించిన గీత రచనలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వరంగల్ నిట్‌లో ప్రపంచ సైన్స్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ నిట్‌లో సోమవారం సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ, థర్మోఫిషర్ సైంటిఫిక్, కీ సైట్ టెక్నాలజీస్, నెట్ వెబ్ టెక్నాలజీస్‌తో కలిసి ప్రపంచ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 'యాక్సెసిబుల్ అనలిటికల్ టెక్నాలజీ'పై ఒక్కరోజు అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుధి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అధిక నాణ్యతా పరిశోధనలను ప్రోత్సహించడంలో, సామాజిక అభివృద్ధికి ఆవిష్కరణలను పెంపొందించడంలో అధునాతన విశ్లేషణాత్మక సాధనాల ప్రాముఖ్యత గురించి వివరించారు. శాస్త్రీయ పరికరాల రంగంలో ప్రముఖ కంపెనీలు థర్మో ఫిషర్ సైంటిఫిక్, కీసైట్ టెక్నాలజీస్, నెట్‌వెబ్ టెక్నాలజీస్ పాల్గొని ప్రదర్శనలు చేపట్టాయని తెలిపారు.

సీఆర్‌ఐఎఫ్ హెడ్ ప్రొఫెసర్ వీరేష్ బాబు, వివిధ విభాగాల నుంచి అనేక మంది ప్రొఫెసర్లు హాజరు కాగా వారు పరిశ్రమ నిపుణులతో చర్చల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కాశీనాథ్, ఇసిఇ విభాగం ప్రొఫెసర్ ఆంజనేయులు, సాంకేతిక అధికారులు గొల్లపల్లి శ్రీరామ సంజీవిని, సుధాకర్ తదితరుల సమన్వయంతో నిర్వహించారు. నిట్ సమీపంలోని కళాశాలల వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధనా పండితులు, విద్యార్థులు హాజరయ్యారు.

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు చేసుకున్నారు. ఆ తర్వాత మరో పదిమంది కూడా వాంతులు చేసుకోవడంతో వారిని ఉపాధ్యాయులు వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పచ్చి పులుసు తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమయ్య ఏర్పడి ఇలా అయినట్టు వైద్యులు తెలిపారు.

సస్పెండ్ చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- లేబర్ కోడ్‌లు కార్మిక చట్టాలుగా మారకముందే యాజమాన్యాల బరితెగింపు
- బిస్లరీలో యూనియన్ పెట్టుకున్నారని ఉద్యోగం తీసివేశారు
- మైక్రోబాక్స్ కంపెనీలో 13 మంది తొలగింపు : చుక్క రాములు

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనియన్ పెట్టుకున్నారనే కక్షతో బిస్లరీ కంపెనీ యాజమాన్యం కార్మికులను విధుల నుంచి తొలగించిందని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. బిస్లరీ, మైక్రో బాక్స్ కంపెనీల్లో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ పెట్టుకుంటే కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ.. సోమవారం సిఐటియు సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో యూనియన్ పెట్టుకున్నారనే సాకుతో ఐదు మంది యూనియన్ నాయకులను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. అదే విధంగా కొండాపూర్ మండలంలో మైక్రోబాక్స్ అనే కంపెనీలో సిఐటియు యూనియన్ పెట్టుకున్నారని 13 మంది కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించారని తెలిపారు. దీనిపై లేబర్ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. చట్టాలు అమలు చేయకపోతే చట్టాన్ని రక్షించాల్సిన యంత్రాంగం ఎందుకు మౌనంగా ఉంటుందో సమాధానం చెప్పాలన్నారు. అనేక కంపెనీల్లో వేతనాలు ఇవ్వడం లేదన్నారు. యూబీ నైజాం బీరు కంపెనీ ఉత్పత్తి ఆపేశారని, దీనివల్ల 200 మంది కాంట్రాక్టు కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా ఉత్పత్తి ఎలా ఆపేస్తారని, మీకు కార్మిక చట్టాలు వర్తించవా అని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఆర్చ్ ఫార్మా కంపెనీలో దాదాపు 11 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఇలా సంగారెడ్డి జిల్లాలోని అనేక కంపెనీల్లో ఇంత దారుణంగా కార్మిక చట్టాల ఉల్లంఘన జరుగుతుంటే లేబర్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. ఇంకా అది పూర్తిగా అమలులోకి రాలేదని, ఈ చట్టాలు ఉండగానే ఇంతఘోరమైన పరిస్థితి ఉంటే రేపు ఈ చట్టాలు రద్దయితే కార్మికులు బానిసలుగా మారాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధంగా యూనియన్ పెట్టుకునే హక్కును కూడా యాజమాన్యాలు సహించే పరిస్థితి లేదని అన్నారు. ఈ అప్రజాస్వామిక వైఖరి విడనాడాలని, తొలగించిన కార్మికులను బిస్లరీ యాజమాన్యం, మైక్రోబాక్స్ యాజమాన్యం వెంటనే పనిలోకి తీసుకోవాలని, ఆర్చ్ ఫార్మా కంపెనీ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, అనేక పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సిగాచి పరిశ్రమలో 54 మంది చనిపోయారని, కోటి రూపాయల నష్టపరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించినా.. ఇప్పటి వరకు అరకోటి కూడా ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాల్ని కట్టడి చేయడంలో ప్రభుత్వాలు, అధికార యంత్రం ముందుకు రాకపోతే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లిఖార్జున్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు బీరం మల్లేశం, జి సాయిలు, కోశాధికారి కె రాజయ్య, ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, నాయకులు ప్రవీణ్, పాండురంగారెడ్డి, బాగారెడ్డి, నాగేశ్వర్ రావు, మైపాల్, యాదగిరి, కె సురేష్, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఎ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బిఇఇతో టిజి రెడ్కో అధికారుల భేటీ

- ఇందనం పొదుపు, సామర్థ్యం పెంపుపై చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెట్ (టిజిరెడ్కో) ఛైర్మన్ ఎ శరత్ నేతృత్వంలోని అధికారుల బృందం బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫియెన్సీ (బిఇఇ) సెక్రటరీ ఇతర ఉన్నతాధికారులతో సోమవారం న్యూ డిల్లీలో సమావేశమైంది. ఇందనం పొదుపు, సామర్థ్యం పెంపు రంగాల ప్రాజెక్టల పురోగతి, సహకారం తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఇందన పొదుపుకు చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా వారికి వివరించారు. దేశంలోనే తొలిసారిగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో కూల్ రూఫ్ కోటింగ్ చేపట్టామని తెలిపారు. దీని ద్వారా ఏటా 700 కిలోవాట్ల ఇందనం పొదుప సాధ్యమవుతుందని అంచనా వేసినట్టు వివరించారు. స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ ఫండ్ (ఎస్‌ఇసిఎఫ్) ద్వారా కొండారెడ్డి పల్లిలో 600 కుటుంబాలకు ఇండికేషన్ కుక్ టాప్స్, ఐదు లీటర్ల ఇండికేషన్స్ ప్రెసర్స్ పంపిణీ చేసినట్టు తెలిపారు. విద్యుత్ వాహనాల ప్రమోషన్ తదితర కార్యక్రమాలను చేపట్టి ప్రజల్లో ఇందనం పొదుపుపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 లక్ష్యాలను వారికి వివరించారు. ఇందన పొదుపు కార్యక్రమాల అమల్లో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందని విఇఇ కార్యదర్శి మిలింద్ దియోరే అన్నారు. భవిష్యత్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిఇఇ డైరెక్టర్ అభిషేక్ శర్మ, టిజి రెడ్కో ఎండి వి అనిల ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంకెపల్లి స్వయం సహాయక బృందానికి అభినందనలు

- సభ్యులను సన్మానించిన పాఠశాల విద్యా సంచాలకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతేడాది (2024-25) 35 మంది విద్యార్థులు మాత్రమే ఉన్న ఆ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది (2025-26) 114కు పెరిగింది. వికారాబాద్ జిల్లా బొమ్రాస్‌పేట్ మండలం, ఎంకెపల్లి గ్రామంలోని మణెమ్మ నాయకత్వంలోని స్వయం సహాయక బందం సభ్యులు బడి బాట కార్యక్రమంలో తీసుకున్న చొరవతో ప్రయివేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడిలోకి మారారు. ఆ బృందం ప్రభుత్వ పాఠశాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే క్రమంలో బస్సు ప్రయాణ సౌకర్యం, గ్రామీణ రోడ్ల అభివృద్ధి తదితర మౌలిక వసతుల కోసం చేసిన కృషి ఫలించింది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్య సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఇ నవీన్ నికోలస్ ఆ బృందాన్ని ప్రత్యేకంగా సన్మానించారు. ప్రభుత్వ విద్య పట్ల ప్రజలకున్న నమ్మకానికి ఎంకెపల్లి ఒక ఉదాహరణ అని ఆయన తెలిపారు. స్థానికంగా ఉండే ప్రజలు చొరవ తీసుకుంటే పాఠశాలల బలోపేతంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందని సూచించారు.

ప్రపంచ ప్రమాణాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పున:నిర్మాణం

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులా స్టేషన్
- పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను పున:నిర్మాణం చేయనున్నట్టు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పున:నిర్మాణ పనుల పురోగతిని మంత్రి పరిశీలించారు. ఆయనతో పాటు దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్: సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకష్ణన్ దక్షిణ మధ్య రైల్వే ప్రధాన పరిపాలనా అధికారి/నిర్మాణం రణధీర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ శ్రీధర్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. స్టేషన్ భవనం రెండు వైపులా ఉన్న నిర్మాణ స్థలాలను మంత్రి సందర్శించారు . అభివృద్ధి పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేశారు. పని ప్రదేశాలలో చేపడుతున్న భద్రతా చర్యలను కూడా ఆయన సమీక్షించారు. అనంతరం స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బ్రిటిష్ కాలంలో నిర్మించబడిందన్నారు. నేడది దక్షిణ భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన స్టేషన్లలో ఒకటిగా ఉందని గుర్తు చేశారు.

రోజుకు 1.97 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, 100కి పైగా రైళ్ల ఈ స్టేషన్ గుండా తిరుగుతున్నాయని వివరించారు. ఆధునిక ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి, రూ.714.73 కోట్ల వ్యయం చేస్తున్నట్టు ప్రకటించారు. సిగ్నల్స్, ట్రాక్‌లు రైలు సేవలకు అంతరాయం కలగకుండా నిర్మాణ పనులు చేపట్టినట్టు మంత్రి చెప్పారు. రద్దీ సమయాల్లో గంటకు దాదాపు 23,000 మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. విమానాశ్రయాలతో సమానంగా ప్రపంచ ప్రమాణాలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. మూడెకరాల స్థలంలో డబుల్ స్టోరీ స్కై కాన్కోర్స్, 3,000 మంది ప్రయాణికులకు వసతి కల్పించే సామర్థ్యంతో వెయిటింగ్ హాల్ కోసం స్థలం, కెఫెటేరియాలు, రెస్టారెంట్లు, రిటైల్ కేంద్రాలు, వినోద సౌకర్యాలు, 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, రెండు ట్రావెలేటర్లు, 5000 కిలోవాట్ల సోలార్ ప్లాంట్, అధునాతన భద్రతా వ్యవస్థలు, రోజుకు ఐదు లక్షల లీటర్ల సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కర్మాగారాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సంవత్సరం మల్టీ-లెవల్ కార్ పార్కింగ్ పూర్తవుతుందన్నారు. సౌత్‌సైడ్ బ్లాక్ రాబోయే నాలుగు నెలల్లో పూర్తవుతుందన్నారు. నార్త్ సైడ్ భవనం, ప్లాట్‌ఫారమ్‌లు, కవర్ ఓవర్ ప్లాట్‌ఫారమ్‌ల పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈ మొత్తం ప్రాజెక్టును డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేస్తున్నట్టు ఆయన తెలిపారు. భవిష్యత్ అవసరాలను దష్టిలో ఉంచుకుని స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు, పని పూర్తయిన తర్వాత రోజుకు 2.7 లక్షల మంది ప్రయాణికులకు , గంటకు 32,500 మంది ప్రయాణికులకు వసతి కల్పించనున్నామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రానికి రూ. 5,337 కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు వివరించారు. గత పదేండ్లల్లో తెలంగాణలో 346 కొత్త రైలు మార్గాలు, 487 కిలోమీటర్ల డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్ ప్రారంభించబడ్డాయని తెలిపారు. పదేండ్లల్లో రికార్డు స్థాయిలో 1959 ట్రాక్ కిలోమీటర్లు విద్యుదీకరించబడ్డాయని అన్నారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి చేసిన.. లైన్‌మెన్‌ను సస్పెండ్ చేయాలి

- చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం : కె ఈశ్వర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడిచేసిన లైన్‌మెన్‌పై వెంటనే చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని, లేకపోతే.. సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని టిజియుఇఇయు (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు అన్నారు. సోమవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్పల్లి సెక్షన్ ఆపరేటర్ సంతోష్‌పై శనివారం ఉదయం 11 గంటలకు సబ్ స్టేషన్ ఆవరణలో దాడిచేసి కొట్టి, బూతులు తిడుతూ చంపడానికి ప్రయత్నం చేసిన లైన్‌మెన్ గంగాదాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అతనితో పాటు అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రవీణ్ కూడా పోలీస్‌స్టేషన్‌లో సంతోష్‌ను 'నువ్వు ఎలా డ్యూటీ చేస్తావో చూస్తాను.' అంటూ బెదిరిస్తూ యూనియన్ నాయకుల ముందే బెదిరించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. వీరిద్దరిపై శాఖపరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది.. ఆర్టిజన్లపై చిన్నచూపు చూస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి చర్యలు సరైనవికావని అన్నారు. భౌతికదాడులకు దిగడం, భయభ్రాంతులకు గురి చేయడంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో డిఇ లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి, ఎన్‌పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షులు జి ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె కనకరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు నల్లూరి నరేష్, బట్టు గంగాధర్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి గురుకుల ఇంటర్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో సోమవారం జరిగింది. కొత్తకోట ఎస్‌ఐ బి ఆనంద్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కెవిపిఎస్ మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు ఆది విష్ణువర్ధన్-బాలమణి కుమారుడు నవీన్‌కుమార్ కొత్తకోట మండలం కానాయపల్లి వద్ద ఉన్న మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సిఇసి చదివేవాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి బయటికి వెళ్లారు.. స్టడీఅవర్ ఉండటంతో వారంతా తిరిగి వచ్చారు. నవీన్ కుమార్ "మీరు వెళ్లండి.. నేను బహిర్భూమికి వెళ్లి వస్తాను" అని చెప్పడంతో నలుగురు స్నేహితులు తిరిగి కాలేజీకి వచ్చారు. రాత్రి అయినా నవీన్‌కుమార్ కళాశాలకు తిరిగి రాకపోవడంతో ప్రిన్సిపల్ పరిసర ప్రాంతాల్లో వెతికించారు. కురుమూర్తి జాతరలో కూడా గాలించారు. అయినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం నవీన్ కుమార్ మృతదేహం కళాశాల సమీపంలో ఉన్న అమడబాకుల చెరువులో తేలింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని వనపర్తి జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే నవీన్ కుటుంబీకులు, బంధువులు, పలువురు నాయకులు ఆస్పత్రికి తరలివచ్చారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కాలేజీ లెక్చరర్ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసంఘాలు, కెవిపిఎస్ నాయకుల సంతాపం

విద్యార్థి మృతిపట్ల ఉమ్మడి జిల్లాలోని సిపిఎం, పలు ప్రజాసంఘాలు, కెవిపిఎస్ నాయకులు సంతాపం తెలిపారు. మృతిపై విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు.

కార్పొరేట్ శక్తులకు విద్యారంగం ధారాదత్తం

- జాతీయ విద్యావిధానంతో అసమానతలు
- ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమం
- జనవరిలో హైదరాబాద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా కన్వెన్షన్ : శ్రీజన్ భట్టాచార్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తోందని, అందుకోసం జాతీయ విద్యావిధానం తీసుకొచ్చిందని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా అధ్యక్షతన సోమవారం జాతీయ కన్వెన్షన్ ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీజన్ మాట్లాడుతూ.. దేశంలో ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు మార్పుల పేరుతో అమెరికన్ విద్యావిధానం అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలిపారు. ఐదేళ్లవుతున్నా జాతీయ విద్యావిధానం నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేయలేదన్నారు. జాతీయ విద్యావిధానం పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులను విద్యారంగంలో తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని, అలాగే అంబాని, ఆదానిలకు విద్యారంగాన్ని అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ విద్యవిధానం వల్ల దేశంలో అసమానతలు పెరిగి సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఉన్నత చదువుకు దూరమవుతారని చెప్పారు. విదేశీ యూనివర్సిటీలు, ప్రయివేటు యూనివర్సిటీలు విచ్చలవిడిగా పెరుగుతాయని, విద్య అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. దానికోసం జనవరిలో హైదరాబాద్‌లో నేషనల్ కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని, ఈ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహించనున్న కన్వెన్షన్‌కు దేశ వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పిఎంశ్రీ పేరుతో జాతీయ విద్యావిధానం అమలు చేయాలని చూస్తోందన్నారు. ఎన్‌ఇపికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానం పేరుతో ఐసిడిఎస్‌ను రద్దు చేసే కుట్రలు మానుకోవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో జనవరిలో మూడు రోజులపాటు నిర్వహించనున్న కన్వెన్షన్‌కు సహకరించాలని కోరారు. అనంతరం ఆహ్వాన సంఘాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, అధ్యక్షులుగా ప్రముఖ విద్యావేత్త వేదకుమార్ వ్యవహరించనున్నారు.

జిఓ 34ను అమలు చేయాలి

- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలనే జిఓ 34ను అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య అన్నారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని తెలిపారు. సోమవారం వికలాంగుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌పిఆర్‌డి సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం-34 ద్వారా మహిళా, శిశు, సంక్షేమ శాఖ, వికలాంగుల సంక్షేమ శాఖ మధ్య జిల్లాలో అందుబాటులో ఉన్న ఉద్యోగులను సర్దుబాటు చేసి వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని 2022 డిసెంబర్ 2న ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం జిఓ ఇచ్చి మూడేళ్లు అవుతున్నా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వికలాంగుల సంక్షేమం, నిర్వహణ కోసం జిల్లా స్థాయి అసిస్టెంట్ డైరెక్టర్‌ను తిరిగి నియమించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల శాఖను ప్రత్యేకంగా కొనసాగించాలని గత ప్రభుత్వం హయాంలో ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించమన్నారు. పోరాటాలకు తలొగ్గిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం జిఓ 34ను విడుదల చేసిందని గుర్తుచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిఓను అమలు చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం బస్వరాజు, కె నర్సింలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలు అవుతున్నా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వికలాంగులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదన్నారు. పింఛన్లు రూ.6000 లకు పెంచుతామని హామీ ఇచ్చి పెంచకుండా ఎందుకు కాలయాపన చేస్తుందని ప్రశ్నించారు. పైగా రెండు లక్షల మంది చేయూత పింఛన్లను రద్దు చేశారని వాపోయారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లలిత, రాంచందర్, సంగమేష్, సహాయ కార్యదర్శులు శంకర్ నాయక్, శివరాజు, జిల్లా నాయకులు నావజ్, సుమలత, సుభాష్, భారత్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీరంగాచార్యకు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇచ్చే విశిష్ట పురస్కారానికి ఈ ఏడాది ప్రముఖ సాహితీవేత్త, ఉత్తమ అధ్యాపకులు, వక్త, గ్రంథ పరిష్కర్త డాక్టర్ శ్రీరంగాచార్య ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ జిల్లా చందుపట్ల గ్రామంలో 1943లో జన్మించిన ఆయన 1966 నుంచి 2022 వరకు మూడున్నర దశాబ్దాలు నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం ఓరియంటల్ కళాశాలలో అధ్యాపకులుగా, ప్రిన్సిపల్‌గా పని చేశారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన ఆరు తరాల మరింగంటి కవుల కృతులను, చందుపట్ల గ్రామంలోని రాణి రుద్రమ దేవికి సంబంటధించిన శాసనాన్ని వెలుగులోకి తెచ్చారు. భైరవకవి శ్రీరంగ మహత్యం, చంద్రిక పరిణయం తదితర గ్రంథాలను పరిష్కరించి విపుల పీఠికలో ప్రచురించారు. నల్లగొండ జిల్లా కవులను, పండితులెందరినో లోకానికి పరియచం చేశారు. ఎన్నో అవధాన కార్యక్రమాలకు సంచాలకులుగా వ్యవహరించారు. ఒక తరం పండితులకు అంతేవాసిగా మెలిగి ఆ పాండితీ సుగంధాన్ని తరువాతి తరానికి అందజేయడంలో కృతకృత్యులయ్యారు. ఆయన పురస్కారంగా రూ.ఒక లక్ష నగదు, ప్రశంసాపత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 2న విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నారు.

గ్రీన్ ఫీల్డ్ రోడ్డు భూ సేకరణపై ఉద్రిక్తత

- అధికారులను అడ్డుకున్న బాధిత రైతులు
- డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి, మరిపల్లి గ్రామాల్లో గ్రీన్ ఫీల్డ్ రీడియల్ రోడ్ భూ సేకరణ నేపథ్యంలో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. భూ సర్వేకు వచ్చిన అధికారులను బాధిత రైతులు అడ్డుకున్నారు. పంట పొలాల మీదుగా రోడ్డు వెళ్తుండటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ సాగు భూములు కోల్పోతామనే భయంతో రైతులు సర్వే బృందం ఎదుట నిరసన తెలిపారు. రైతులు భూమి ఇవ్వాల్సిందేనని అధికారులు స్పష్టం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తమ భూములు ఇచ్చేది లేదని రైతులు కూడా తేల్చి చెప్పారు. అనంతరం తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందించారు. గత్యంతరం లేక సర్వే బృందం వెనుదిరిగింది. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లోని తమ పంట పొలాల నుంచి రోడ్డు వెళ్లడంతో తాము రోడ్డున పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులు తాటిచెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, రోడ్డుతో తాటిచెట్లు నాశనమైతే తమ బతుకుదెరువు సర్వనాశనం అవుతుందని తెలిపారు. పండ్ల తోటలు కూడా రోడ్డుకు వెళ్లే లైన్‌లో ఉన్నాయని అన్నారు. పంటల కాలంలో భూములపై సర్వే చేయడం అన్యాయమని అన్నారు. భూ సేకరణకు ముందుగా ప్రజలతో చర్చించి సరైన పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు జోగు వీరయ్య, రవికాంత్‌గౌడ్, భిక్షపతి, వెంకటరెడ్డి, గౌరయ్య, నారాయణరెడ్డి, మహేష్, రాములు, మల్లేష్, యాదయ్య, అన్నెపు జెన్నయ్య, శంకరయ్య, చంద్రయ్య, వెంకటేష్, శ్రీను, జోగు యాదయ్య, నరసింహ, కటిక రామచంద్రి, శంకర్‌రెడ్డి, మొహమ్మద్ చోటే, గౌపూర్ తదితరులు పాల్గొన్నారు.